*RELEASED FROM*
*CPI(M) state office*
H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202
E-mail: cpimap@gmail.com

# - వామపక్ష పార్టీలు

**ప్రచురణార్థం/ ప్రసారార్థం:**

**తేది : జనవరి 5, 2016**
**విజయవాడ**

వామపక్ష పార్టీల సమావేశం ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయంలో సిపిఐ(యం.యల్) నాయకులు గుర్రం విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశంలో పి.మధు, వై.వెంకటేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు -(సిపిఐ(యం)), కె.రామకృష్ణ, జెల్లి విల్సన్ - (సిపిఐ), యన్.మూర్తి - (సిపిఐయం.యల్ లిబరేషన్), యం.వెంకటరెడ్డి, కాటం నాగభూషణం -(యం.సిపిఐ(యు)), పి.వి.సుందరరామరాజు - (ఫార్వర్డ్‌బ్లాక్), అమర్‌నాద్ - (యస్‌యుసిఐ(సి)), గౌతమ్ (సిపిఐయం.యల్ న్యూడెమోక్రసి) పాల్గొన్నారు.

సమావేశం ఈ క్రింది తీర్మానాలు చేసింది.

(1) వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర సమస్యలపై రాబోయే కాలంలో ఆందోళనా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా మొదటి దశలో రాయలసీమ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న నీటి వనరులు, కరువు, ఉపాధి, వలసలు, పరిశ్రమల స్థాపన, తదితర సమస్యలపై బస్సుయాత్ర ఆందోళన జరపాలని నిర్ణయించబడింది. ప్రచారంలో భాగంగా 4 జిల్లాల్లో బస్సు యాత్రలు నిర్వహించబడతాయి. దానికిముందు జిల్లాల వారి సమస్యలపై పాదయాత్రలు, సదస్సులు, సెమినార్‌లు ద్వారా ఆందోళన ప్రారంభం అవుతుంది. అసెంబ్లీ సమావేశాల మొదటి వారంలో చలో అసెంబ్లీకి పిలుపు ఇవ్వబడింది.

అలాగే ఉత్తరాంధ్రలో ప్రజా సమస్యలపై కూడా వివిధ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం పిలుపునిచ్చింది.

(2) రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు ముఖ్యంగా వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల కార్యకర్తలపై ప్రభుత్వం నిర్భంధం ప్రయోగించడాన్ని సమావేశం ఖండించింది. ఆందోళన సందర్భంగా కేసులను బనాయించడం, రెండో ప్రక్కన ముఖ్యమంత్రి మంత్రుల పర్యటనల సందర్భంగా వామపక్షాల అకారణంగా ముందస్తు అరెస్టులు చేయడం నిత్యకృత్యం అయ్యింది. ఇటువంటి అరెస్టులద్వారా ప్రతిపక్షాల గొంతు నొక్కాలని ప్రయత్నించడం గర్హనీయం. ఇటువంటి చర్యలను విడనాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

(3) పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపైన, విలీన మండలాల సమస్యలపైన ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని సమావేశం ఖండించింది. ఆ ప్రాంతంలో వామపక్ష పార్టీల నాయకులు ఈ నెల 17,18 తేదీలలో పర్యటించాలని నిర్ణయించబడింది.

(4) విశాఖలో బాక్సైట్ త్రవ్వకాలకి వ్యతిరేకంగా గిరిజనులు చేస్తున్న ఆందోళనకు సమావేశం మద్దతు ప్రకటించింది. వామపక్షాలు ఆ ప్రాంతాలలో పర్యటించి ప్రత్యక్షంగా మద్దతు తెలపాలని నిర్ణయించబడింది.

(5) రాష్ట్రంలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా భూ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరిగే ప్రదర్శనకు రైతులు పెద్ద ఎత్తున కదిలి రావాలని విజ్ఞప్తి చేసింది.

సమావేశ ప్రారంభంలో ఇటీవల మరణించిన కమ్యూనిస్టు ఉద్యమ సీనియర్ నేత కా॥ ఎ.బి.బర్దన్ మృతికి సంతాపం ప్రకటించింది.

ఆర్. లక్ష్మయ్య

**(ఆర్. లక్ష్మయ్య)**
వామపక్ష పార్టీల తరపున